క్లుప్తంగా

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఎస్పీ మేరీ ప్రశాంతి



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

లింగపాలెం : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి మంగళవారం లింగపాలెం మండలంలోని పలు పోలింగ్ స్టేషన్లు పరిశీలించారు. ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులతో ఆమె పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల నిర్వహణకు కావాల్సిన మౌలిక సదుపాయాలుపై సమీక్షించారు. ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్సును పోలీసు అధికారులు, ప్రజలు పాటించాలని ఆమె ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలీసులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నూజివీడు ఏసీబీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ధర్మాజీగూడెం ఎస్సై చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్సై జయబాబు

కామవరపుకోట: ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఓటర్లంతా బాధ్యతగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తడికలపూడి ఎస్సై జయబాబు కోరారు. మంగళవారం స్థానిక ఎన్నికల చెక్‌పోస్టు వద్ద ఓటర్లను చైతన్య పరిచేందుకు ముద్రించిన కరపత్రాల బ్రోచర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఓటర్లు భయాందోళనకు గురికాకుండా పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు వేయడానికి పోలీస్ శాఖ అన్ని చర్యలూ చేపట్టిందని చెప్పారు. కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు, టీవీఎస్ రాజు, నీజాపరపు దుర్గాప్రసాద్, సాజన్ సాయి, వీఆర్ఓ కె.బాబురావు, పోలీసు సిబ్బంది కె.రమేష్, కె.రామకృష్ణ, సూర్యారావు, వెంకన్నబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న వెంకట్రాజు

కొయ్యలగూడెం: ఇటీవల తాడిచెట్టు పై నుంచి పడిపోయి తీవ్రమైన గాయాలపాలైన సీతంపేట గ్రామానికి చెందిన మద్యాహ్నపు చంద్రశేఖర్ అనే కల్లుగీత కార్మికుడికి తనున్నానంటూ బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన నాటక శాల వెంకట్రాజు రూ.2 లక్షల ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. చంద్రశేఖర్ కోలుకోవడానికి ఖరీదైన వైద్యం అవసరమని డాక్టర్లు చెప్పడంతో విషయాన్ని తెలుసుకున్న వెంకటరాజు తన వంతు సాయం అందించారు. చంద్రశేఖర్ కోలుకునే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

అన్నదాన వితరణ



బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీ వల్లీ దేవసేన సమేత సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సుమారు 1500 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రాపోలు భావన రుషి, శ్రీ సాయి తేజ టైలరింగ్ మెటీరియల్ షాప్ యాజమాన్యం, సాయి స్ఫూర్తి ఆసుపత్రి వైద్యులు శ్వేతశ్రీల ఆర్థిక సాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించామని అన్నప్రసాద వితరణ కమిటీ అధ్యక్షుడు గంగాధరరావు తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ల ఏర్పాటు నిమిత్తం బుధ, గురువారాల్లో మండలంలోని పలు గ్రామాలకు బుధ, గురువారాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ జేపీబీ నటరాజన్ తెలిపారు. ద్వారకాతిరుమల గ్రామంతో పాటు శ్రీవారి ఆలయానికి, దొరసానిపాడు, సత్తెన్నగూడెం, రాళ్లకుంట గ్రామాలకు, లక్ష్మీపురంలోని విర్డ్ ఆస్పత్రికి, సీఎస్ఆర్ పరిశ్రమకు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరం గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.11,600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సుధీర్ తెలిపారు.

సర్కారు స్కూళ్లు.. సరికొత్త హంగులు

చింతలపూడి : వైఎస్సార్ సీపీ హయాంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యంత ప్రాధాన్యత లభించింది. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలను తలదన్నేలా కొత్త హంగులతో రూపుదిద్దుకున్నాయి. నాడు-నేడు కార్యక్రమంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. తరగతి గదులు, బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, అధునాతన ఫర్నిచర్, తాగునీటి కుళాయిలు (ఆర్‌ఓ ప్లాంట్) ఏర్పాటు, రంగురంగుల బొమ్మలతో పాఠశాలలు కొత్త రూపును సంతరించుకున్నాయి. దీంతో విద్యార్థుల ప్రవేశాలూ పెరిగాయి. చింతలపూడి నియోజకవర్గంలో నాడు - నేడు ఫేజ్-1లో 92 పాఠశాలలను రూ.18.08 కోట్లతో అభివృద్ధి చేశారు. ఫేజ్-2లో 163 పాఠశాలలను రూ.60.49 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. మండలాల వారీగా.. చింతలపూడిలో తొలి విడతలో రూ.5.20 కోట్లు ఖర్చు చేసి 22 పాఠశాలలను, రెండో విడతలో 44 పాఠశాలలను రూ.14.48 కోట్లతో అభివృద్ధి చేశారు. జంగారెడ్డిగూడెంలో తొలి విడత 26 పాఠశాలలకు రూ.6.81 కోట్లు, రెండో విడతలో 55 పాఠశాలలకు రూ.20.26 కోట్లు, కామవరపుకోటలో తొలి విడతలో 23 పాఠశాలలకు రూ.4.76 కోట్లు, రెండో విడతలో 35 పాఠశాలలకు రూ.14.56 కోట్లు, లింగపాలెంలో తొలి విడతలో 21 పాఠశాలలకు రూ.2.43 కోట్లు, రెండో విడతలో 29 పాఠశాలలకు రూ.11.09 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశారు.



ఆధునికీకరించిన చింతలపూడి హైస్కూల్ ముందు భాగం

మారిన విద్యారంగం రూపురేఖలు



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక రాష్ట్రంలో విద్యారంగం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. పల్లె ప్రాంతాల్లో కూడా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. మరోసారి ముఖ్యమంత్రి కాగానే మిగిలి ఉన్న పాఠశాలలను కూడా ఆధునికీకరించి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకొస్తారు.

– కంభం విజయరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి, చింతలపూడి



నాడు-నేడులో అభివృద్ధి చేసిన చింతలపూడి ప్రభుత్వ బాలుర హైస్కూల్



నాడు-నేడులో రూపుదిద్దుకున్న కామవరపుకోట హైస్కూల్



కామవరపుకోట మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ క్లాస్

తల్లి గెలుపు కోసం తనయుడి ప్రచారం



అలివేరులో ప్రచారం చేస్తున్న సాయివిశాల్

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి గెలుపుకోరుతూ ఆమె తనయుడు సాయి విశాల్ మంగళవారం అటవీప్రాంత మారుమూల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి విశాల్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేశారని అన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలకు ఎనలేని కృషి చేశారని చెప్పారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా దట్టమైన అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు సైతం ప్రభుత్వ ఫలాలు అందే విధంగా కృషి చేశారని అన్నారు. మళ్లీ జగనన్న సీఎంగా గెలిస్తేనే సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయని చెప్పారు. మే 13న జరిగే ఎన్నికల పోలింగ్‌లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తెల్లం రాజ్యలక్ష్మి, ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌లకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తెల్లం రాముడు, మాల్చి వెంకన్నబాబు, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్ బాజీ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ నాయకులు కారం వాసు, సింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తేనే సంక్షేమ పాలన



రామన్నగూడెం పంచాయతీలో ప్రచారం

ద్వారకాతిరుమల: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తేనే సంక్షేమ పాలన కొనసాగుతుందని మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. గడపగడపకు వెళ్లి జగనన్న ప్రవేశపెట్టిన నవరత్న పథకాల వల్ల చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించిన జగనన్నకు మళ్లీ పట్టం కట్టాలని కోరారు. పథకాలు కొనసాగాలంటే జగనన్నే సీఎం కావాలన్నారు. ఫ్యాన్ గుర్తులపై ఓటేసి గోపాలపురం ఎమ్మెల్యేగా తానేటి వనితను, రాజమండ్రి ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. రామన్నగూడెంలో జరిగిన ప్రచారంలో నాయకులు పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, చెరుకూరి ప్రసాదరావు, పి.వెంకటేశ్వరరావు, కె.సత్యనారాయణ, సూరయ్య, రాంబాబు, శ్రీను, నాగరాజు, విజయ్‌బాబు, ముక్కరామన్న, చెన్నయ్ సురేష్, షేక్ ఇస్మయిల్ తదితరులున్నారు.

వలంటీర్ల రాజీనామా

లింగపాలెం : పుప్పాలవారిగూడెం గ్రామానికి చెందిన ఏడుగురు వలంటీర్లు మంగళవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను కార్యదర్శి అశోక్‌కు అందజేశారు. తమపై ప్రతిపక్ష పార్టీలు అవలంబిస్తోన్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ రాజీనామా చేసినట్టు వలంటీర్లు చెప్పారు.

విస్తృతంగా వైఎస్సార్ సీపీ ప్రచారం



చింతలపూడి : సీతానగరంలో ప్రచారం చేస్తున్న శ్రేణులు



చింతలపూడి : ప్రగడవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దృశ్యం



కొయ్యలగూడెం : వేదంతపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం

చింతలపూడి : వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కె.సునీల్ కుమార్ యాదవ్, కంభం విజయరాజుల గెలుపు కోరుతూ ఆ పార్టీ శ్రేణులు మంగళవారం విస్తృతం ప్రచారం చేశారు. సీతానగరం గ్రామంలో సర్పంచ్ గాయం మల్లేశ్వరి, ఎంపీటీసీ కలకొండ రామారావులు ఓటర్లను కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓట్లేయాలని కోరారు. నాయకులు కోటగిరి పండు బాబు, దన్నపనేని హరిబాబు, మల్లారెడ్డి రంగబాబు, ధనరాజు, చిట్టిబాబు రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● ప్రగడవరం పంచాయతీలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, గోలి రామకృష్ణారెడ్డి, ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు సోదరి పొన్నాల అనిత తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు.

జగనన్న రుణం తీర్చుకుందాం

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ.. సీఎం జగనన్న రుణం తీర్చుకుందామంటూ ఆ పార్టీ నాయకులు మండలంలో మంగళవారం ముమ్మరంగా ప్రచారం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కారుమూరి సునీల్, తెల్లం రాజ్యలక్ష్మిల గెలుపు కోరుతూ వేదాంతపురం గ్రామంలో నాయకులు ప్రచారం చేశారు. రామానుజపురం గ్రామంలో యువకులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. జై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి ఆకట్టుకున్నారు.

తండ్రీ కొడుకుల ప్రచారం

టి.నరసాపురం: వైఎస్సార్ సీపీ గెలుపు కోరుతూ తండ్రీకొడుకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. టి.నరసాపురం పంచాయతీ పుట్రేవు, రుద్రకోట రాజుగూడెం గ్రామాల్లో మంగళవారం సహకార సంఘం మాజీ ఛైర్మన్ దేవరపల్లి ముత్తయ్య, ఆయన కుమారుడు, పార్టీ యూత్ నాయకుడు దేవరపల్లి సీతారామ్ ప్రసాద్ పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తెల్లం రాజ్యలక్ష్మి, ఎంపీగా సునీల్‌కుమార్‌లను ఫ్యాన్‌గుర్తుకు ఓట్లేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టి.నరసాపురం కాశీ విశ్వేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కందుల రమేష్‌రాజు, నాయకులు నోముల సత్యనారాయణ, అర్జా బాలయ్య, సాగర్, దారా ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం : రామానుజ పురం గ్రామంలో ప్రచారం



టి.నరసాపురం : రుద్రకోట రాజుగూడెంలో ఎన్నికల ప్రచారం



టి.నరసాపురం : గండిగూడెంలో ఎన్నికల ప్రచారం

ఏజెన్సీలో గాలి, వాన బీభత్సం



ముప్పినవారిగూడెంలో పిడుగుపడి కొబ్బరిచెట్టుపై వస్తున్న మంటలు



రేగులకుంట సమీపంలో పడిపోయిన విద్యుత్ స్తంభాలు, తాడిచెట్లు

బుట్టాయిగూడెం: భానుడి ప్రతాపానికి ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు మంగళవారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఉపశమనం పొందారు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కుండపోతగా వాన కురిసింది. గాలి వాన బీభత్సానికి అనేక చోట్ల చెట్లు నేల కొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగి వడ్డాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. జీడిమామిడి పిందె దశలో ఉండగా తీవ్రంగా వీచిన గాలులకు పంట రాలిపోయే పరిస్థితి ఉందని, పొగాకు పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బుట్టాయగూడెం మండలం ముప్పినవారిగూడెంలో రెండు కొబ్బరిచెట్లపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మన్యం విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం అప్‌లాండ్ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సమితి కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పెన్మెత్స రంగరాజు, ప్రధాన కార్యదర్శి నంబూరి రామచంద్రరాజులు మాట్లాడుతూ అల్లూరి వీరత్వం, స్వాతంత్ర్య సముపార్జనలో చూపించిన తెగువ, ప్రాణత్యాగం తదితర అంశాలను వివరించారు. తొలుత కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అల్లూరి మున్సిపల్ పార్కులో, సౌభాగ్య థియేటర్ సెంటర్‌లో, అశ్వారావుపేట రోడ్డులో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.రంగరాజు, ఎస్.రామచంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరునికి జోహార్లు

కామవరపుకోట: విప్లవ వీరుడు, అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. సీపీఐ నాయకులు టీవీఎస్ రాజు, గ్రంథపాలకులు ఎస్.భీమరాజు, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తి

కుక్కునూరు: అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదామని సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి తిరోజుల సురేష్ (చంటి) పిలుపునిచ్చారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతి సందర్భంగా కుక్కునూరులోని అల్లూరి విగ్రహానికి హమాలీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు హమాలి జట్టు వర్కర్స్ యూనియన్ మేస్త్రి మడకం జోగరావు, నెర్రబోయిన సాయిరాం, కారం రమేష్, దాసురి నాగరాజు, లాడే వెంకట్రావు, రామ్‌చరణ్, గరటం శ్రీనివాసరావు, కుర్సం ముత్తేష్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: అల్లూరి సీతారామరాజు వర్ధంతిని మంగళవారం కొయ్యలగూడెం, కన్నాపురం గ్రామాల్లో నిర్వహించారు. స్థానిక జంగారెడ్డిగూడెం రోడ్డులోని ట్రిబుల్ ఆర్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు మంతెన సోమరాజు ఆధ్వర్యంలో సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఎంపీపీ గంజిమాల రామారావు, ఎంపీటీసీ గంట శ్రీను, దారం సత్తిరాజు, మారిశెట్టి శ్రీను, కట్ట రాము, తొంటా వాసు, మడుతూరు శ్రీను, తదితరులు పాల్గొన్నారు. సీపీఐ మండల కన్వీనర్ జమ్మి శ్రీనివాస్ అల్లూరి విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. కన్నాపురంలో క్షత్రియ సేవా సంఘం, సీపీఐఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహాల వద్ద నివాళులర్పించారు.



జంగారెడ్డిగూడెంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



కొయ్యలగూడెంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ముంచెత్తిన వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

ద్వారకాతిరుమల: భానుడి భగభగలతో గత కొద్దిరోజులుగా ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు మంగళవారం కురిసిన భారీ వర్షంతో సేదతీరారు. కుండపోత వర్షం కురవడంతో మండలంలోని పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ఇళ్లలోకి, పొలాల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. భీమడోలు - ద్వారకాతిరుమల ప్రధాన రహదారిలోని తిమ్మాపురం విర్డ్ ఆస్పత్రి సమీపంలో, గొల్లగూడెం చెరువు వద్ద, ద్వారకాతిరుమల సబ్‌స్టేషన్ వద్ద రోడ్లు కాలువలను తలపించాయి. వాహనచోదకులు నీటిలోంచే రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. చినవెంకన్న దర్శనార్థం క్షేత్రానికి విచ్చేసిన భక్తులు వర్షం కురవడానికి ముందు దట్టమైన కారు మబ్బులు, చల్లని గాలుల నడుమ ఆహ్లాద భరితంగా మారిన వాతావరణంలో ఉల్లాసంగా గడిపారు. వర్షంలోనే పరుగులు తీస్తూ స్వామి దర్శనానికి వెళ్లొచ్చారు. ఆలయ ప్రధాన రాజగోపుర మెట్ల దారి వెంబడి వర్షపు నీరు భారీగా ప్రవహించింది. భక్తుల వాహనాల పార్కింగ్ ప్రాంతం మడుగుగా మారింది.



ద్వారకాతిరుమల క్షేత్రంపై కమ్మేసిన కారు మబ్బులు



ద్వారకాతిరుమల సబ్‌స్టేషన్ వద్ద కాలువగా మారిన రహదారి